ఆప్యాయంగా మాట్లాడసాగాడు. రాజు వైపు అసలు కన్నెత్తి కూడా చూడలేదు. దాంతో కోపం వచ్చిన రాజు ఆయన్ని తీసుకెళ్ళి కారాగారంలో బంధించమని, తన ప్రశ్నకి జవాబు చెప్పేదాకా వదలద్దని భటులకి ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆ మహనీయుడు రాజు వైపు చూసి, చిరునవ్వుతో చెప్పాడు.

"రాజా! ఇందాకటి నించి నేను నీ ప్రశ్నకి మౌనంగా చెప్పే జవాబు నీకు అర్థం అయినట్లు లేదు. నీకన్నా తక్కువ స్థాయివారిని నేను పలకరిస్తూ, నిన్ను పట్టించుకోక పోవడం వల్ల నీకు నా మీద కోపం వచ్చింది. దాంతో నాకు శిక్ష వేసావు. మరి నాకన్నా, నీకన్నా, మనందరి కన్నా శ్రేష్ఠుడైన ఆ పరమాత్మని నువ్వు తలచుకోకుండా వుంటే ఆయనకి కోపం రాదా? నీ ప్రశ్నకి ఇదే జవాబు: సదా ఆయన్ని స్మరిస్తూండు. అలాంటి వారికే మోక్షం ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది."

## 119. అబద్ధం

ఇద్దరు సాధువులు ఓ కొండ మీద తపస్సు చేసుకుంటున్నారు. వారున్న కొండ అంచు అవతల సముద్రం వుంది. అకస్మాత్తుగా వేటగాళ్ళ బూర కొమ్ముల ధ్వని, వారి వల్ల బెదిరి పరిగెత్తే జంతువుల అరుపులు, వారెక్కి వచ్చే గుర్రాల కాలి గిట్టల ధ్వని వాళ్ళకి వినిపించాయి. ఓ జింక వారి వైపు వేగంగా పరిగెత్తుకుని వచ్చింది. కొండ అంచు దాకా వచ్చి అవతల వున్న సముద్రాన్ని చూసి కుడి వైపు పరిగెత్తి మాయమైంది.

ఓ సాధువు రెండో అతనితో చెప్పాడు.

"వేటగాళ్ళు వచ్చి మనల్ని ఆ జింక ఎటెళ్ళిందని అడుగుతారు. నిజం చెప్తే దాన్ని వాళ్ళు వెంటాడి చంపుతారు."

"మనకి తెలీదని చెప్దాం." రెండో సాధువు సూచించాడు.

"అది అబద్ధం ఆడటం అవుతుంది. మనం ఎప్పుడూ అబద్ధాలు ఆడకూడదు."

"నిజం చెప్తే మాత్రం ఆ జింకని చంపిన పాపం చుట్టుకోదా?" ప్రశ్నించాడు రెండో సాధువు.

కొద్ది సేపటికి ఆ వేటగాళ్ళు అక్కడికి వచ్చి ఈ ఇద్దరినీ చూసి అడిగారు.

"ఇటొచ్చిన జింక ఎటెళ్ళింది?"

రెండో సాధువు కొద్దిగా ఆందోళనగా వారి వంక చూసాడు.

మొదటి సాధువు మాత్రం అబద్ధం ఆడకుండా వారికి జవాబు చెప్పి జింకని ప్రమాదం నించి కాపాడాడు.

"మీరీ ప్రశ్న మమ్మల్ని అడగడం సమంజసం కాదు. మేము దాని తరఫున వున్నాం."

సాధారణంగా మనం ప్రపంచంలో ఆడే అబద్ధాల్లో ఎక్కువ శాతాన్ని ఎదుటివాళ్ళు ఏమనుకుంటారో అని నిజాన్ని నిష్కర్షగా చెప్పలేకపోవడం వల్లనే ఆడుతూంటాం.

## 120. దేవుడ్ని చూపించు

"స్వామి! దేవుడు అన్నిటా వుంటాడంటారు. అది నిజమేనా?"

"అవును."

"ఐతే ఈ అరటి పండులో కూడా వున్నాడా?"

"ఉన్నాడు."

"ఉంటే చూపించండి."

"ఇది బయటకి ఏ రంగులో వుంది?"

"పసుపు పచ్చగా."

"కాని ఆ పసుపు పచ్చ రంగు దేవుడు కాడు. లోపల ఏ రంగులో వుంది?"

"తెలుపు."

"కాని ఆ తెలుపు దేవుడు కాడు. పండు ఏ రుచిలో వుంటుంది?"

"తియ్యగా."

"కాని ఆ తీపిదనం దేవుడు కాడు. పండు స్పర్శకి ఎలా వుంటుంది?"

"మెత్తగా."